సాక్షి నంద్యాల

బుధవారం । 28 । ఫిబ్రవరి । 2024



కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగు నీటి అవసరాలకు కేసీ కాల్వకు మంగళవారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు.



పెద్దమ్మకు నైవేద్యం

మహానంది: బొల్లవరంలో మంగళవారం పెద్ద మ్మ తల్లికి గ్రామస్తులు పూజలు నిర్వహించారు. కుల, మతాలకు అతీతంగా బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలోని స్వామిఅమ్మ వార్ల ఆలయప్రాంగణంలోని శనగల బసవ న్నకు, శ్రీబయలు వీరభద్ర స్వామి వారికి మంగ ళవారం విశేష పూజలను నిర్వహించారు.

న్యూస్‌రీల్

త్వరలో మహా కుంభాభిషేకం

● ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి



మంత్రి కొట్టు సత్యనారాయణకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈఓ, పండితులు

మహానంది: మహానంది క్షేత్రంలో మహాకుంభాభిషేకం నిర్వహించేందుకు త్వరలో ముహూర్తం ఖరారు చేస్తామని ఆలయ కార్య నిర్వహణ అధికారి కాపు చంద్రశేఖర్ రెడ్డి, వేద పండితులు రవిశంకర్ అవధాని అన్నారు. మహానందిలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ మంగళవారం రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణకు ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం ఆలయ పండితులు స్వామి అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా మహానందిలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల వివరాలను వారు వివరించారు. మహానందిలో కుంభాభిషేకం, కలశ ప్రతిష్ట కార్యక్రమాలకు త్వరలో కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి ముహూర్తం నిర్ణయిస్తారని తెలిపారు. వారి వెంట దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్‌లు చంద్ర మోహన్‌కుమార్, చంద్రశేఖర ఆజాద్, ఉప ప్రధాన అర్చకులు జనార్ధనశర్మ, ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పాల సేకరణ దారులకు లైసెన్సులు తప్పనిసరి

నంద్యాల (సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా పలు డైయిరీలు, వినియోగదారులకు పాలు సరఫరా చేసే సేకరణదారులు కొత్తగా వచ్చిన పాల సేకరణ, నాణ్యమైన పాల వినియోగ చట్టం–2023 ప్రకారం లైసెన్సులు తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గోవింద నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 480 వరకు పాల సేకరణదారులు ఉన్నట్లు అధికారులు అంచనా వేశారన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో మార్చి 10 లోపు లైసెన్స్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు. పాల సేకరణ క్రమంలో జరిగే లావాదేవీల నియంత్రణ, భద్రతా ప్రమాణాల పాటింపుతో పాటు డైయిరీ రైతులు, వినియోగదారుల ప్రయోజనాలు కాపాడేందుకే ప్రభుత్వం తాజాగా ఈ చట్టం తెచ్చినట్లు ఆయన వివరించారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.2.53 కోట్లు

మంత్రాలయం: రాఘవేంద్రస్వామి మఠం హుండీ ఆదాయం రూ.2,53,73,131 వచ్చినట్లు మఠం మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం శ్రీమఠం రాజాంగణ భవనంలో శ్రీమఠానికి చెందిన 29 రోజులకు సంబంధించిన హుండీల ఆదాయాన్ని లెక్కించారు. రూ.2.53 కోట్ల నగదు, 92 గ్రాముల బంగారం, 720 గ్రాముల వెండి కానుకలు సమకూరినట్లు వివరించారు.

ఉరుకుంద హుండీ ఆదాయం రూ. 1.11 కోట్లు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయంలోని హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం కాలక్షేపవు మండపంలో డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో లెక్కించారు. రూ.1,11,32,643 నగదు, 18.900కిలోల వెండి, 46.540 గ్రాముల బంగారం సమకూరినట్లు వారు తెలిపారు. దేవదాయశాఖ ఆదోని గ్రూపు టెంపుల్ ఈఓ రాంప్రసాద్, ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి పాల్గొన్నారు.

రాయితీ ప్రోత్సాహం భరోసా సంపూర్ణం

● 54,376 మంది రైతులకు సున్నా వడ్డీ పంట రుణాలు
● విడుదల కానునన్న రూ.11.08 కోట్ల వడ్డీ రాయితీ
● సకాలంలో పంట రుణాలు చెల్లించిన రైతులకు ప్రోత్సాహం
● నేటితో వైఎస్ఆర్ రైతుభరోసా 100 శాతం పూర్తిగా అమలు
● పీఎం కిసాన్ కింద రైతన్నలకు రూ.47.06 కోట్లు
● నేడు జిల్లా రైతులకు రూ.58.14 కోట్ల ఆర్థిక తోడ్పాటు

బ్యాంకుల నుంచి తీసుకున్న పంట రుణాలను గడువులోపు చెల్లించిన రైతులకు వడ్డీ రాయితీ విడుదలకు జగనన్న ప్రభుత్వం సిద్ధమైంది. వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాలు కింద రైతులు చెల్లించిన వడ్డీని వెనక్కి ఇవ్వడంతో పాటు కౌలుదారులు, అటవీభూములు, ఎండోమెంటు భూములు అనుభవిస్తున్న రైతులకు వైఎస్ఆర్ రైతు భరోసా కింద ఆర్థిక తోడ్పాటు లభించనుంది. మరోవైపు 2023–24 సంవత్సరానికి పీఎం కిసాన్ కింద భూ యజమానులకు మూడో విడత నిధులు విడుదల కానున్నాయి. – ఆళ్లగడ్డ

వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు రైతన్నలకు వ్యవసాయంపై ఆసక్తిని పెంచుతున్నాయి. చంద్రబాబు హయాంలో రైతులకు ప్రోత్సాహం కరువై... కరువు, కాటకాలతో వ్యవసాయాన్ని వదిలేస్తే.. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్నదాతలకు వ్యవసాయం పండుగైంది. ఒకవైపు వైఎస్ఆర్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం, మరోవైపు రూపాయి ప్రీమియం లేకుండా వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా అమలు చేస్తూ రైతులను ఆదుకుంటోంది. మరోవైపు బ్యాంకుల రుణాలను గడువు లోపు చెల్లించిన రైతులకు వడ్డీ రాయితీ ఇస్తోంది. కౌలుదారులకు కూడా వైఎస్సార్ రైతుభరోసా కింద పెట్టుబడి సాయం ప్రభుత్వమే చెల్లిస్తోంది. 2023–24 వర్షాభావం వల్ల కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. కరువులో రైతులకు ఊరటనిస్తూ వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాలు కింద రైతులు చెల్లించిన వడ్డీని వెనక్కి ఇవ్వడంతో పాటు కౌలుదారులు, ఆటవీభూములు, ఎండోమెంటు భూములు అనుభవిస్తున్న రైతులకు వైఎస్ఆర్ రైతుభరోసా కింద ఆర్థిక తోడ్పాటు లభిస్తోంది. మరోవైపు 2023–24 సంవత్సరానికి పీఎం కిసాన్ కింద భూ యజమానులకు మూడవ విడత నిధులు విడుదల కానున్నాయి.ఈనెల 28న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బటన్ నొక్కి నేరుగా రైతుల ఖాతాలకు నిధులు జమ చేయనున్నారు.

54,376 మంది రైతులకు ఉపశమనం

నంద్యాల జిల్లాలో వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాలు కింద 54,376 మంది రైతులకు రూ.11.08 కోట్ల ఆర్థిక ప్రయోజనం కలుగుతోంది. 2021–22 రబీ సీజన్‌లో పంట రుణాలు తీసుకుని గడువులోపు చెల్లించిన రైతుల బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం వైఎస్ఆర్ సున్నా వడ్డీ రాయితీ కింద 29,347 మంది రైతులకు రూ. 6,82,29,044 విడుదల చేస్తోంది. 2022–23 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 25,029 మంది రైతులకు 4,26,30,881 విడుదల చేస్తుండటం విశేషం. మొత్తంగా నంద్యాల జిల్లాలో 54,376 మంది రైతులకు రూ.11,08,59,925 ఆర్థిక తోడ్పాటు లభిస్తుంది. బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు రైతులకు 7 శాతం వడ్డీతో పంట రుణాలు పంపిణీ చేస్తున్నాయి. గడువులోపు వడ్డీతో సహా చెల్లించిన రైతులందరూ వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంటరుణాలకు అర్హులు. ప్రభుత్వం రైతులకు 4 శాతం వడ్డీని రైతుల బ్యాంకు ఖాతాలకు విడుదల చేస్తోంది. మిగిలిన మూడు శాతం వడ్డీని కేంద్ర ప్రభుత్వం ఇన్సెంటివ్ ఇస్తుంది. మొత్తంగా రైతులకు సున్నా వడ్డీ అమలు అవుతుంది. పంట రుణాలను గడువులోపు చెల్లించిన రైతులకు 4 శాతం వడ్డీ రాయితీ ఇస్తోంది.

రూ. 47.06 కోట్ల భరోసా

వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ పథకానికి సంబంధించి జిల్లాలో 2,34,151 మంది రైతులు అర్హులుగా గుర్తించారు. ఇందులో భూ యజమానులతో పాటు, దేవదాయ, ఆటవీ భూములు సాగు చేసుకుంటున్న వారు, భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సాగు దారులు (కౌలు రైతులు) ఉన్నారు. వీరందరికీ రూ 2 వేల చొప్పున మొత్తం రూ. 47.06 కోట్లు నగదు రైతుల ఖాతాల్లో జమ కానుంది. వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ కింద ప్రభుత్వం ఏటా మూడు విడుతల్లో రూ. 13,500 సాయాన్ని అందిస్తోంది. రూ. 7,500 మే నెలలో, రూ.4 వేలు అక్టోబర్‌లో, మిగిలిన రూ. 2 వేలు జనవరిలో జమ చేస్తున్నారు. భూ యజమానులకు మాత్రమే పీఎం కిసాన్ కింద కేంద్రం మూడు విడతల్లో రూ. 6వేల చొప్పున జమ చేస్తోంది. ఎలాంటి భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన కౌలుదారులతో పాటు దేవదాయ, అటవీ, వక్ఫ్ తదితర ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న, కౌలు దారులకు రూ. 13,500 చొప్పున వైఎస్సార్ రైతు భరోసా కింద రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. ఈ క్రమంలో గత జూన్‌లో ఖరీఫ్ కింద ఒక్కో రైతుకు రూ.7,500, అక్టోబర్‌లో రబీకి రూ.4 వేల ప్రకారం జమ చేయగా.. తాజాగా తుది విడతగా రూ.2 వేల ప్రకారం ఇవ్వనున్నారు. మొత్తంగా ఏటా రూ. 13,500 ప్రకారం పెట్టుబడి సాయం ఐదో విడత అందనుంది.



సేద్యం చేస్తున్న రైతు

తీసుకున్న పంటకే రుణం..

బ్యాంకు నుంచి ఏ పంటకు రుణం తీసుకున్నారో.. అదే పంట భూమిలో ఉండాలి. ఈ–క్రాప్‌లో కూడా నమోదై సంబంధిత రైతు ఈ–క్రాప్‌లో నమోదు చేసిన వివరాలను ధ్రువీకరిస్తూ ఈ–కేవైసీ చేసి ఉండాలి. అపుడే వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాలకు అర్హత లభిస్తుంది. అయితే చాలా మంది రైతులు బ్యాంకుల నుంచి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఎక్కువగా ఉండే పంటకు రుణం తీసుకుంటున్నారు. అయితే భూమిలో మాత్రం మరోపంట వేస్తున్నారు. అందువల్ల ఈ–క్రాప్‌లో తేడాలు ఉండటం వల్ల సున్నా వడ్డీ పంట రుణాలకు అర్హత పొందలేకపోతున్నారు. రైతులు జాగ్రత్తలు తీసుకుంటే సున్నా వడ్డీ రాయితీకి అర్హత లభిస్తుంది.

నియోజకవర్గాల వారీగా వైఎస్సార్ రైతు భరోసా పీఎం కిసాన్ లబ్ధిదారులు

నియోజకవర్గం	అర్హులైన రైతులు	జమ కానున్న నగదు(రూ.కోట్లలో)
ఆళ్లగడ్డ	49,145	15.02
బనగానపల్లె	44,485	12.36
డోన్	37,337	8.28
నందికొట్కూరు	42,300	12.37
నంద్యాల	16,121	6.02
పాణ్యం	15,649	5.04
శ్రీశైలం	29,053	8.52
మొత్తం	2,34,151	47.06

సున్నా వడ్డీ రాయితీ వివరాలు

నియోజకవర్గం	లబ్ధిదారులు	మొత్తం (రూపాయల్లో)
ఆళ్లగడ్డ	9,891	1,88,76,081
బనగానపల్లె	11,373	2,20,97,248
డోన్	13,163	3,03,87,139
నందికొట్కూరు	9,860	1,88,86,995
నంద్యాల	2,564	54,25,488
పాణ్యం	2,134	48,59,559
శ్రీశైలం	5,391	1,03,27,415
మొత్తం	54,376	11,08,59,925

ఇది రైతు ప్రభుత్వం



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తోంది. వరుసగా ఐదేళ్లుగా రైతు భరోసా వచ్చింది. గత ఏడాది వరి సాగులో మంచి దిగుబడులు వచ్చాయి. మద్దతు ధరకే ధాన్యం విక్రయించా. ప్రస్తుతం రైతు భరోసా, సున్నా వడ్డీ రాయితీ సొమ్మును జమ చేయాలని నిర్ణయించడం ఆనందంగా ఉంది. రైతు భరోసా సాయం పెట్టుబడికి ఎంతో ఉపయోగ పడుతుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.
– భూపాల్ రెడ్డి, యర్రగంట్ల

జగనన్న మేలు మరువలేం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారు. గతంలో వ్యవసాయం చేయాలంటే పెట్టుబడుల కోసం నానా తంటాలు పడేవాళ్లం. సమయానికి అప్పులు దొరకగా పొలాలను బీళ్లుగా ఉంచేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రైతు భరోసా పథకంతో ఆదుకుంటున్నారు. కరువుతో నష్టపోయిన రైతులకు అండగా నిలుస్తున్నారు. సీఎం మేలును ఎప్పటికీ మరువం.
– వెంకటరాముడు, శెట్టివీడు

అర్హులెవరూ నష్టపోరాదు



అర్హులైన రైతులు అందరి ఖాతాల్లో సున్నావడ్డీ రాయితీతో పాటు 'వైఎస్సార్ రైతు భరోసా' పీఎం కిసాన్ నిధులు కూడా జమ కానున్నాయి. నగదు జమ అయినట్లు మెసేజ్ రాని వారు 'వైఎస్సార్ రైతు భరోసా' యాప్ ద్వారా స్టేటస్ చూసుకోవచ్చు. అర్హులైన ఏ ఒక్క రైతూ నష్టపోకూడదనేది ప్రభుత్వం నిర్ణయం. వైఎస్సార్ రైతు భరోసా, సున్నావడ్డీ రాయితీ వివరాలు ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచాం.
– మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు కృషి





సమావేశానికి హాజరైన పోలీసు అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న డీఐజీ సీహెచ్ విజయరావు

● డీఐజీ సీహెచ్ విజయరావు

బొమ్మలసత్రం: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీస్ శాఖలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు అన్నారు. మంగళవారం ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో జిల్లా పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటే క్షణాల్లో సిబ్బంది ఆయా ప్రాంతానికి చేరుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేసి మద్యం, నగదు అక్రమ తరలింపును అరికట్టాలన్నారు. హత్య కేసుల్లో ముద్దాయిల వివరాలు సేకరించి వారి నుంచి ఎన్నికలకు ఎటువంటి అంతరాయం కలగకుండా ముందస్తుగా కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులను పోషించే శక్తులపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. గత ఎన్నికల్లో సమస్యలు సృష్టించిన నేరస్తులు, సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా ఉంచాలని పేర్కొన్నారు. సమావేశం అనంతరం డీఐజీ సీహెచ్ విజయరావు, ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డితో కలిసి జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ భవన సముదాయాన్ని పరిశీలించారు. స్పెషల్ బ్రాంచ్ పోలీస్‌స్టేషన్, దిశ, ఎస్సీ,ఎస్టీ సెల్, డీసీఆర్‌బీ, క్లూస్‌టీమ్ తదితర స్టేషన్‌లను ఈ సముదాయంలో ఏర్పాటు చేయనున్నట్లు డీఐజీకి ఎస్పీ వివరించారు.

టెట్ ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఆర్‌జీఎం, శాంతిరాం, ఎస్‌వీఆర్ ఇంజనీరింగ్, రామకృష్ణ డిగ్రీ కాలేజీలలను కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. ఆయా కేంద్రాలను రాష్ట్ర పరిశీలకులు గంగాభవానీ పరిశీలించారు. ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1,046 మంది అభ్యర్థులకు గానూ 99 మంది గైర్హాజరైనట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈమె వెంట పరీక్షల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం బ్రహ్మంనాయక్, సభ్యులు ఉన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు అక్రిడేషన్

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలకు అక్రిడేషన్ గుర్తింపు లభించినట్లు మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డి.రంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ కమిటీ సభ్యులు గత డిసెంబర్ నెలలో మూడు రోజుల పాటు పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలించారన్నారు. కళాశాలలో ఉన్న మౌలిక సదుపాయాలు, ఇక్కడ ఉన్న సిబ్బంది అర్హత, అనుభవాలను పరిశీలన జరిపి ఈ అక్రిడేషన్ గుర్తింపు ప్రకటించారన్నారు. కళాశాలకు అక్రిడేషన్ రావడం పట్ల డిపార్ట్‌మెంట్ హెడ్‌లు, సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ బిల్లులు వసూలు చేయండి

కర్నూలు(అగ్రికల్చర్): ఈనెల చివరిలోపు 100 శాతం విద్యుత్ బిల్లులు వసూలు చేయాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఎం.ఉమాపతి అధికారులను ఆదేశించారు. మంగళవారం విద్యుత్ భవన్‌లోని తన కార్యాలయం నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా విద్యుత్ బిల్లుల వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఫిబ్రవరి నెలకు ప్రభుత్వేతర విద్యుత్ బిల్లులు రూ.166 కోట్లు వసూలు కావాల్సి ఉందన్నారు. ఈనెల 26 నాటికి రూ.140 కోట్లు వసూలు అయిందన్నారు. మిగిలిన రూ.26 కోట్లు ఈ నెల 29వ తేదీ సాయంత్రానికి వసూలు చేయాలన్నారు. నంద్యాల డివిజన్‌లో రూ.4 కోట్లు, కర్నూలు డివిజన్‌లో రూ.13 కోట్లు, డోన్ డివిజన్‌లో రూ.3 కోట్లు, కర్నూలు రూరల్ డివిజన్‌లో రూ.1 కోటి, ఆదోని డివిజన్‌లో రూ.3 కోట్ల ప్రకారం విద్యుత్ బిల్లులు వసూలు చేయాల్సి ఉందన్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించకపోతే 29వ తేదీ సాయంత్రం నుంచి కనెక్షన్‌లు తొలగించాలని ఆదేశించారు. సమావేశంలో డీఈఈ భాస్కర్ ఉన్నారు.

జ్యోతిబాపూలే పాఠశాలల ప్రవేశాలకు వేళాయె

● 5 నుంచి 10వ తరగతి వరకు ఉచిత వసతి, విద్య
● 2024–25 విద్యాసంవత్సరం 5వ తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
● మార్చి 1 నుంచి 31 వరకు దరఖాస్తుల స్వీకరణ
● ఏప్రిల్ 27న రాత పరీక్ష



మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల

నంద్యాల(న్యూటౌన్): వెనుకబడిన తరగతుల విద్యార్థుల చదువుకు వెన్నుదన్నుగా నిలుస్తూ మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. 'నాడు–నేడు' కార్యక్రమంతో మౌలిక వసతులు కల్పించారు. క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యాబోధన, రుచికరమైన భోజనం, ఆడపిల్లలకు పూర్తిస్థాయి రక్షణ కల్పిస్తుండడంతో ఏడాదికేడాది సీట్ల భర్తీకి డిమాండ్ పెరుగుతోంది. ఒక సీటుకు 15 మంది చొప్పున విద్యార్థులు పోటీ పడుతున్నారు. నంద్యాల జిల్లాలోని డోన్, ఆళ్లగడ్డ, నెరవాడ (బాలికలు), శ్రీశైలం, బేతంచెర్ల, బనగానపల్లె (బాలురు) పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 5 నుంచి 10వ తరగతి వరకు 1,217 మంది బాలికలు, 1,651 మంది బాలురు మొత్తం 2,868 మంది విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. ప్రతి పాఠశాలలోనూ సీసీ కెమెరాల పర్యవేక్షణలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 5 గంటలకు నిద్ర లేచింది మొదలు రాత్రి 9 గంటల వరకూ విద్యార్థులపై ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉంటోంది. రాత్రి 9 నుంచి తెల్లవారుజాము 5 గంటల వరకూ ఓ నర్సు, పీఈటీ, టీచర్, నైట్ వాచ్‌మెన్ పర్యవేక్షణ ఉంటుంది. బేతంచెర్ల, డోన్ గురుకుల పాఠశాలకు ప్రభుత్వం రూ. 72 కోట్లతో పక్కా భవనాలు నిర్మిస్తోంది.

5వ తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ..

2024–25 విద్యా సంవత్సరంలో మహాత్మ జ్యోతి బా పూలే గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. మార్చి1 నుంచి 31వ తేదీ వరకూ https://mjpapbcwreis. apcfss. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏప్రిల్ 27న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాత పరీక్ష ఉంటుంది. రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు. పాణ్యం సమీపంలోని నెరవాడ జ్యోతి బాపూలే బాలుర పాఠశాలలో పూర్తిస్థాయిలో వసతులు ఉండడంతో 80 సీట్లను భర్తీ చేయనున్నారు. మిగిలిన స్కూళ్లలో 40 సీట్ల చొప్పున భర్తీ చేస్తారు.

సీట్లకు డిమాండ్ పెరిగింది



నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు పూర్తి స్థాయి. రక్షణ కల్పిస్తుండడంతో బీసీ గురుకుల పాఠశాలల్లో సీట్లకు డిమాండ్ పెరిగింది.. ఒక్కో సీటుకు 15 మంది చొప్పున విద్యార్థులు పోటీ పడుతున్నారు. 2024–2025 విద్యా సంవత్సరానికి సంబంధించి నోటిఫికేషన్ వచ్చింది. 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. ప్రతిభ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తాం. విద్యా ర్థులు సద్వినియోగం చేసుకోవాలి.
– జయమ్మ, బీసీ గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్, నంద్యాల

రైతు బజార్.. కొత్త రూపు

● స్టాళ్ల కేటాయింపులో మరింత పారదర్శకత
● ఈ–క్రాప్ ప్రామాణికంగా రైతుల గుర్తింపు
● ఎస్ఈడీ డిస్‌ప్లే బోర్డులపై ధరల వివరాలు



నంద్యాల(సెంట్రల్): జిల్లాలోని రైతుబజార్ల పనితీరును మరింత మెరుగుపర్చే లక్ష్యంతో ప్రభుత్వం పలు సంస్కరణలు తీసుకొస్తోంది. జిల్లాలో నంద్యాలలో 2, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, వెలుగోడులో ఒక్కొక్కటి మొత్తం 5 రైతుబజార్లు ఉన్నాయి. వీటి ద్వారా 5 వందల మందికి ప్రత్యక్షంగా, వెయ్యి మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తోంది. రోజూ 5 టన్నుల కూరగాయలతోపాటు ఇతర నిత్యావసరాల విక్రయాలు జరుగుతున్నాయి. సగటున రోజూ 2 వేల మంది రైతుబజార్లను వినియోగించు కుంటున్నారు. స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా రైతుబజార్ల పనితీరును క్రమబద్ధీకరిస్తున్నారు. గతంలో స్టాళ్లు పొందిన వారిలో బినామీలను ఏరివేస్తూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నారు. మరోవైపు నూతన రైతుబజార్లు, ప్రస్తుత రైతుబజార్ల ఆధునికీకరణ ద్వారా పెరిగిన స్టాళ్ల కేటాయింపులో పైరవీలకు ఆస్కారం లేకుండా పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేలా చర్యలు చేపట్టారు.

బినామీలకు అవకాశం లేకుండా..

రైతుబజార్లలో రైతులకు అద్దెరహిత స్టాళ్ల కేటాయింపు వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ, మార్కెటింగ్ శాఖల భాగస్వామ్యంతో చేస్తుంటారు. ఇప్పటివరకు మాన్యువల్ పద్ధతిలో వీటిని కేటాయిస్తున్నారు. ఫలితంగా పైరవీలు, అవకతవకలకు చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిస్థితికి చెక్ పెడుతూ ఇక నుంచి అద్దెరహిత స్టాళ్ల కేటాయింపు విషయంలో ఈ–క్రాప్ నమోదు ప్రామాణికంగా రైతులను ఎంపిక చేయాలని ప్రతిపాదించారు. స్టాళ్ల ద్వారా విక్రయించే పంట ఉత్పత్తుల్లో కనీసం కొన్ని రకాలైనా సొంతంగా పండించే వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఒక స్టాల్ కోసం ఎక్కువ మంది పోటీ పడితే లాటరీ పద్ధతిలో కేటాయించనున్నారు. స్వయం సహాయక, సహకార సంఘాలకు, చిరువ్యాపారులకు అద్దె ప్రాతిపదికన కేటాయించే స్టాళ్ల కోసం ఇప్పటివరకు జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ నేతృత్వంలోని కమిటీలు ఎంపిక చేస్తున్నాయి. ఇక నుంచి ప్రభుత్వ ఈ– ప్రొక్యూర్మెంట్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసిన వారిని ఈ–వేలం ద్వారా ఎంపిక చేయాలని సంకల్పించారు. ఇందుకోసం అర్హత ప్రమాణాలను నిర్ణయించే బాధ్యతలను జిల్లాస్థాయిలో జాయింట్ కలెక్టర్ నేతృత్వంలోని కమిటీలకు అప్పగిస్తున్నారు.

నోడల్ ఖాతాలో రైతుబజార్ల ఆదాయం

రైతుబజార్లలో ఖాళీగా ఉన్న అన్ని స్టాళ్ల కేటాయింపుతోపాటు పాలు, సేంద్రియ వంట ఉత్పత్తుల విక్రయం వంటి వ్యవసాయ సంబంధిత కార్యకలాపాలకు శ్రీకారం చుట్టారు. క్యాంటీన్లు, పార్కింగ్, ఇతర సౌకర్యాల నిర్వహణ కోసం గుర్తించిన స్థలాలను వేలం ద్వారా కేటాయిస్తున్నారు. ప్రతి రైతుబజారులో ధరల వివరాలను వినియోగదారులకు తెలియజేసేలా ఎస్ఈడీ డిస్ ప్లే బోర్డులను ఏర్పాటు చేశారు. వ్యాపారులు, కార్పొరేట్ సంస్థల ప్రయోజనార్థం ప్రకటనల కోసం గుర్తించిన ప్రదేశాలతో పాటు ఖాళీ స్థలాలను సైతం ఈ– యాక్షన్ ద్వారా కేటాయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇలా వచ్చే ఆదాయాన్ని రైతుబజార్ల సీఈవో ఖాతాలో జమచేస్తూ సిబ్బంది వేతనాలు, నిర్వహణ ఖర్చులకు ఇబ్బంది లేకుండా సర్దుబాటు చేయనున్నారు. ఇప్పటి వరకు వేతనాలు, నిర్వహణ కోసం స్థానిక మార్కెట్ కమిటీలపై ఆధారపడాల్సి వచ్చేది. సొంతంగా ఆదాయవనరులు సమకూర్చుకోవడం ద్వారా రైతుబజార్లు స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా ఈ సంస్కరణలు తీసుకొచ్చారు.

స్టాళ్ల కేటాయింపులో పారదర్శకతకు పెద్దపీట



జిల్లా వ్యాప్తంగా రైతు బజార్ల ద్వారా వినియోగ దారులు రైతులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నాం. ముఖ్యంగా స్టాళ్ల కేటాయింపులో ఎటువంటి పైరవీలకు ఆస్కారం లేకుండా అర్హులైన వారికే కేటాయిస్తున్నాం. వెలుగోడులో ఇటీవలే ప్రారంభించిన రైతు బజారులో 29 స్టాళ్లు, నాలుగు గదులు అద్దెకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయి.
– అబ్దుల్ రెహమాన్, జిల్లా అగ్రి ట్రేడింగ్ మార్కెటింగ్ అధికారి

క్లుప్తంగా

పట్టువస్త్రాలు సమర్పణ



పట్టువస్త్రాలను ఈఓకి సమర్పిస్తున్న వారణాసి రామ్మోహన్‌రావు దంపతులు

మహానంది: శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వారికి హైదరాబాద్ నగరానికి చెందిన వారణాసి రామ్మోహన్ రావు, విజయ లక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు మంగళవారం అందజేశారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధానిల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అవసరమయ్యే వేలాది రూపాయల విలువ చేసే పట్టువస్త్రాలను సమర్పించారు. సుమారు పాతికేళ్లుగా వీరు దసరా నవరాత్రి, శివరాత్రి ఉత్సవాల సమయంలో స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను అందిస్తూ భక్తిని చాటుకుంటున్నారు.

యువకుడి బలవన్మరణం



దాసరి రాజు (ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని కలుగొట్ల గ్రామానికి చెందిన దాసరి రాజు (19) కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో సోమవారం ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. బంధువులు తెలిపిన వివరాలు. దాసరి మునిస్వామి, దాసరి ఈరమ్మలకు కుమారుడు రాజు(19), ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రాజు ఇంటర్ వరకు చదువుకున్నాడు. తల్లిదండ్రులు మూడు నెలల క్రితం బతుకు తెరువు కోసం గుంటూరుకు వలస వెళ్లడంతో రాజు గ్రామంలోనే ఉంటున్నాడు. ఏడు రోజుల క్రితం బెంగళూరుకు వెళ్లి తన స్నేహితుడి గదిలో ఉంటున్నాడు. స్నేహితుడు ఉదయం పనికోసం వెళ్లి రాత్రి గదికి వచ్చి చూడగా రాజు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేళాడుతున్నాడు. స్థానికుల సాయంతో అతడు పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి వచ్చి పరిశీలించారు. వచ్చినప్పటి నుంచి మానసిక వేదన, దిగులతో ఉండేవాడని స్నేహితులు చెపుతున్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బెంగళూరుకు వెళ్లి మృతదేహాన్ని మంగళవారం కలుగొట్లకు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

ప్ర'జల' కష్టాలు తీర్చేలా!

- నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళిక
- జిల్లాలో రూ.812 లక్షలతో ప్రతిపాదనలు
- నీటి సమస్య తలెత్తే 246 గ్రామాల గుర్తింపు
- ట్యాంకర్లు, ప్రత్యామ్నాయంగా నీరు అందించేలా ఏర్పాట్లు



జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం

గోస్పాడు: వేసవి తీవ్రతతో గ్రామాల్లో నీటి సమస్య తలెత్తే అవకాశం ఉండటంతో నీటి ఎద్దడి నివారణకు అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత నాలుగు సంవత్సరాలుగా సకాలంలో వర్షాలు కురియడంతో నీటి వనరులు సమృద్ధిగా ఉన్నాయి. గ్రామాల్లో ప్రజలకు తాగునీరు అందించేందుకు వాటర్ ట్యాంకులు, బోర్లు ఏర్పాటు చేయడంతో పాటు పైప్‌లైన్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ఈ ఏడాది ఆశించిన మేర వర్షాలు లేకపోవడంతో రిజర్వాయర్లలో నీటి వనరులు తగ్గిపోయాయి. దీంతో ఈ వేసవిలో నీటి ఎద్దడి తలెత్తే గ్రామాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టేందుకు అధికారులు అప్రమత్తమయ్యారు. నంద్యాల జిల్లాలో 29 మండలాల పరిధిలో 766 గ్రామాలు ఉన్నాయి. ఈ వేసవిలో దాదాపు 246 గ్రామాల్లో నీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని, రూ.812 లక్షల నిధులతో పనులు చేపట్టేలా గుర్తించారు. ప్రజలకు, పశువులకు తాగేందుకు, అవసరాలకు వాడుకునేందుకు నీరు ఎంతో అవసరం. అయితే ఎక్కడ నీటి కష్టాలు తావులేకుండా ఏఏ గ్రామాల్లో ఎంత మేరకు నీటికి పూర్తిస్థాయి సౌకర్యాలు ఉన్నాయి, ఎంత మేరకు నీటి సౌకర్యం కల్పించాలి, గ్రామాలలో ఉన్న బోర్ల పనితీరుపై, ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించి సరఫరా చేయాల్సిన గ్రామాలపై దృష్టి సారించి పనులు చేసేలా చర్యలు చేపట్టారు. సాధారణంగా ప్రతిమనిషికి 55 లీటర్ల నీరు అందించాల్సి ఉండగా ఎండా కాలంలో కేవలం తాగునీటి కోసం 15 లీటర్లకు తక్కువ కాకుండా అందించేలా చర్యలు చేపట్టనున్నారు. జిల్లాలో 5,455 బోర్లు ఉన్నాయి. వాటిలో 5,087 బోర్లు పని చేస్తుండగా 363 బోర్లు పని చేయడం లేదు. తిరిగి 363 బోర్లలో 33 బోర్లు మరమ్మతులకు నోచుకోగా 204 బోర్లు సీజనల్‌గా పని చేస్తాయని, 126 బోర్లు శిథిలమైనట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. జిల్లాలో అత్యధికంగా ఉయ్యాలవాడ, కొలిమిగుండ్ల, డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో నీటితీవ్రత అధికంగా ఉన్నట్లు గుర్తించారు.



గోస్పాడులో నీటి సరఫరా చేసే వాటర్ ట్యాంకులు

ట్యాంకర్లతో తరలింపు.. బోర్ల మరమ్మతులు.

జిల్లాలోని గ్రామాల్లో ఎండా కాలం దృష్ట్యా నీటి ఎద్దడి లేకుండా చేసేందుకు ఆయా గ్రామాల నీటి సమస్య తీవ్రతను బట్టి గ్రామస్థాయి నుంచి ప్రతిపాదన చేశారు. అందులో 246 గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉండే 82 గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా, 20 గ్రామాల్లో పశువుల కోసం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు అంచనాలు రూపొందించారు. అలాగే 13 గ్రామాల్లో ప్రైవేటు బోర్లను అద్దెకు తీసుకొని ప్రజలకు నీటికష్టాలు లేకుండా చేసే చర్యలు చేపట్టనున్నారు. దీంతో పాటు ఇప్పటికే గ్రామాల్లో ఉన్న బోర్ల నుంచి నీరు తక్కువగా వచ్చే వాటిని గుర్తించి వాటిలో ఏదైనా అడ్డుపడి ఉంటే వాటిని సరిచేయడం, తక్కువ లోతులో ఉన్న బోర్ల ద్వారా వచ్చే నీరు తక్కువగా ఉంటే బోర్లను లోతుపెంచడం వంటి పనులు చేపట్టనున్నారు.

నీటి సమస్య తలెత్తే గ్రామాలు, వాటి కోసం ప్రతిపాదన చేసిన నిధుల వివరాలు

నియోజకవర్గం	నీటి సమస్య తలెత్తే గ్రామాలు	నిధుల అంచనా (రూ.లక్షల్లో)
ఆళ్లగడ్డ	33	116.06
బనగానపల్లె	34	154.53
శ్రీశైలం	25	39.54
నందికొట్కూరు	8	42
పాణ్యం	11	195
నంద్యాల	15	96.27
డోన్	120	168.68

"ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం



జిల్లాలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాం. ఎండాకాలం కావడంతో గ్రామాల్లో నీటి సమస్య తలెత్తే 246 గ్రామాలను ఇప్పటికే గుర్తించాం. ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన తాగునీటి పథకాలు, బోర్ల పనితీరును అంచనా వేసి ప్రత్యామ్నాయంగా నీటి తరలింపునకు కసరత్తు చేపట్టాం. –మనోహర్, ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా ఇంజనీరింగ్ అధికారి, నంద్యాల

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌కు శనివారం ఆఖరు

కర్నూలు(సెంట్రల్): నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ఈ శనివారంలోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన పట్టాలకు సంబంధించి కన్వేయన్ డీడ్‌లను సోమవారంలోపు లబ్ధిదారులకు అందజేయాలన్నారు. మంగళవారం కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా పలు ముఖ్యమైన సంక్షేమ, అభివృద్ధి పనులపై జిల్లా, మండలస్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 62వేల రిజిస్ట్రేషన్‌లు పూర్తయ్యాయని.. పెండింగ్‌లోని 10వేల పట్టాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లను ఈవారంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాకు 5.45 లక్షల ఆరోగ్యశ్రీ కార్డులు వచ్చాయని, వాటిని వారంలోపు సంబంధిత లబ్ధిదారులకు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్, ఎంపీడీఓలను ఆదేశించారు. కార్డుల పంపిణీ సమయంలో ఆరోగ్యశ్రీ యాప్‌ను కూడా డౌన్‌లోడ్ చేయించాలన్నారు. టెలి కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, కర్నూలు మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, కర్నూలు, పత్తికొండ ఆర్‌డీఓలు శేషిరెడ్డి, రామలక్ష్మీ, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య పాల్గొన్నారు.

పదునైన ఆయుధాలపై నిషేధం పొడిగింపు

నంద్యాల (సెంట్రల్): పదునైన ఆయుధాలను దగ్గర ఉంచుకోవడం, వెంట తీసుకెళ్లడంపై ఇదివరకు ఉన్న నిషేధాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా జీవో నెంబర్ –24 సంబంధించిన గెజిట్‌ను విడుదల చేశారు. రాయలసీమ రీజియన్‌లోని ఉమ్మడి కర్నూలు అనంతపురం, చిత్తూరు, వైఎస్సార్ కడప జిల్లాల పరిధిని ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నిషేధం గత జనవరి 15 నుంచి వర్తిస్తుందని తెలిపారు.

ఉపాధ్యాయుడిపై వేటు

అనధికారిక గైర్హాజరవుతున్న ఓ ఉపాధ్యాయుడిని ప్రభుత్వం విధుల నుంచి తొలగించింది. గతంలో మిడుతూరు మండలం సుంకేసుల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం ప్రస్తుతం కోసిగి మండలం కొట్టాలలో పని చేస్తున్నారు. ఈయన దాదాపు మూడేళ్ల ఐదు నెలల పాటు అనధికారికంగా విధులకు హాజరు కాలేదని, క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆయనను శాశ్వతంగా విధుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి

- రాష్ట్ర పరిశీలకురాలు గంగాభవానీ



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకురాలు గంగాభవానీ

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని పదో తరగతి పరీక్షల రాష్ట్ర పరిశీలకురాలు, వయోజన విద్యాశాఖ రాష్ట్ర డైరెక్టర్ గంగాభవానీ అన్నారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాలలో పదవ తరగతి పరీక్షలపై చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లు, కస్టోడియన్లలతో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా సిబ్బంది అప్రమత్తతో పని చేయాలన్నారు. పరీక్షల విధానాన్ని డైరెక్టర్ అడల్ట్ ఎడ్యుకేషన్ అధికారులు వివరించారన్నారు. జిల్లాలోని రెగ్యులర్ విద్యార్థులకు 134 సెంటర్లు ఏర్పాటు చేయగా ఓపెన్ స్కూల్ విద్యార్థులకు 9 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల కమిషనర్ గోపాల్ మాట్లాడుతూ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఇప్పటికే సమాధాన పత్రాలు పోలీసు స్టేషన్లకు చేరాయన్నారు. డీఈఓ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో మార్చి 18 నుంచి 10వ తరగతి పరీక్షలు జరుపుటకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. విద్యార్థులు చక్కగా చదువుకొని పరీక్షలకు సంసిద్ధం కావాలన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోనిఅర్బన్: కర్ణాటక మద్యాన్ని మంగళవారం ఆదోని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. భరత్ నగర్‌కు చెందిన వెంకటేష్ సొంత ఆటోలో కర్ణాటక రాష్ట్రం శిరుగుప్ప నుంచి ఆదోనికి మద్యం తెస్తున్నాడని సమాచారం రావడంతో టూటౌన్ సీఐ గోపీ, పోలీసు సిబ్బంది నిఘా ఉంచి తనిఖీలు చేపట్టారు. ఆటోను ఆపి సోదా చేయగా 20 బాక్సుల మద్యం బయటపడింది. మద్యం, ఆటోను సీజ్ చేసి, నిందితుడు వెంకటేష్‌ను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

రహదారుల పనులను త్వరితగతిన పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో కె.మధుసూధన్‌రావు

కర్నూలు(సెంట్రల్): రహదారుల్లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీఆర్వో కె.మధుసూధన్‌రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ పెండింగ్ పనులను పూర్తి చేయడంతోపాటు సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. గత సమావేశంలో తీసుకున్న జాతీయ రహదారి 40లో ఎల్లమ్మ గుడి సమీపంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం, ఓర్వకల్ సమీపంలోని జగనన్నకాలనీకి సరీ్వసు రోడ్డు నిర్మాణాలకు సంబంధించి జాయింట్ సర్వే పనులపై డీఆర్వో ఆరా తీశారు. అందుకు జాతీయ రహదారుల అధికారులు స్పందిస్తూ ఎల్లమ్మ గుడి దగ్గర అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి జాయింట్ సర్వే వీలు కాదని, వార్షిన ప్లాన్‌లో చర్యలు తీసుకుంటామన్నారు. కర్నూలులోని బళ్లారి చౌరస్తా నుంచి రాజ్‌విహార్ వరకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తీసుకున్న ప్రణాళికలపై డీఆర్వో ఆరా తీయగా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి ప్రభుత్వానికి పంపినట్లు మునిసిపల్ అధికారులు వివరించారు. నగరంలో నిర్మాణంలోని బస్ షెల్టర్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్ మాట్లాడుతూ గతంలో హిట్ అండ్ రన్ కేసుల విచారణ చేసే కమిటీలో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా డీఎస్పీ, తహసీల్దార్లు సభ్యులుగా ఉండేవారన్నారు. అయితే రాష్ట్ర విచారణ కమిటీని సవరిస్తూ జీఓ నంబర్ 93 విడుదల చేసిందని, దాని ప్రకారం జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, ఎస్పీ, సబ్‌డివిజనల్ ఆఫీసర్లు సభ్యులుగా ఉంటారన్నారు. అంతేకాక బీమా కంపెనీకి చెందిన వ్యక్తి మెంబర్ సెక్రటరీగా ఉండటంతో బాధితులకు పరిహారాన్ని త్వరగా అందజేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం 2023 డిసెంబర్ వరకు జరిగిన రోడ్డు ప్రమాదలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించారు. సమావేశంలో పీఆర్ ఎస్‌ఈ సుబ్రమణ్యం, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు, ఆర్టీఓ రమేష్, డిప్యూటీ డెమో భాస్కర్ పాల్గొన్నారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: నంద్యాల శివారులోని చాపిరేవుల టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్‌ను జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం అక్రమంగా తరలింపులు జరగకుండా ప్రతి వాహనం క్షుణ్ణంగా పరిశీలించాలని ఎస్పీ సూచించారు. వాహనాలు నిలపకుండా వెళితే వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేసి వాహనాలను పట్టుకోవాలని ఆదేశించారు.

పరిశుభ్రత పాటించకుంటే చర్యలు

- 9 మంది ఉద్యోగులకు మెమోలు



బాలసదన్ చిన్నారులతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ వెంకటలక్షుమ్మ

కర్నూలు(అర్బన్): బాల సదన్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోకపోతే చర్యలు తప్పవని మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి పి.వెంకటలక్షుమ్మ హెచ్చరించారు. 'వార్డెన్ కొడుతోంది.. చంపేస్తానంటోంది !' శీర్షికన ఈ నెల 27న 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. మంగళవారం పెద్దపాడు దామోదరం సంజీవయ్య బాల సదన్‌కు వెళ్లి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సదన్‌లో విధులు నిర్వహిస్తున్న మ్యాట్రిన్ /వార్డెన్ విజయతో పాటు ఇతర ఉద్యోగులు, చిన్నారులతో ప్రత్యేకంగా మాట్లాడామన్నారు. నాలుగవ తరగతి చదువుతున్న కరిష్మా చెప్పిన విధంగా పిల్లలతో అక్కడ ఎవరూ పనులు చేయించడం లేదన్నారు. మొత్తం 20 మంది విద్యార్థులకు తొమ్మిది మంది సిబ్బంది ఉన్నారన్నారు. తరచూ ఆ బాలిక తమ ఊరికి పోవాలనే ఆలోచనతో ఉండేదని సహచర బాలికలు చెప్పారన్నారు. ఊరికి వెళ్లిన సమయంలో కూడా చెప్పిన సమయానాకి ఏరోజు రాలేదని.. వారం, పది రోజులు ఆలస్యంగా వచ్చేదని సిబ్బంది చెప్పారన్నారు. బాలసదన్‌కు సంబంధించిన రికార్డులను కూడా పరిశీలించామన్నారు. పరిసరాలు చాలా అపరిశుభ్రంగా ఉండటంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న తొమ్మిది మంది ఉద్యోగులకు మెమోలు జారీ చేశామన్నారు.

కొత్త వంగడాలు రైతులకు చేరాలి



మాట్లాడుతున్న పరిశోధన స్థానం సహ సంచాలకులు వెంకటేశ్వర్లు

నంద్యాల (సెంట్రల్): శాస్త్రవేత్తలు ఆవిష్కరించిన కొత్త వంగడాలు రైతులకు చేరాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహసంచాలకులు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం స్థానిక ఏరువాక కేంద్రంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమన్వయ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నూతన సాంకేతిక పద్ధతులు, కొత్త వంగడాలను ఎప్పటికప్పుడు రైతులకు పరిచయం చేస్తూ వారి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. గుంటూరు ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ విశాలాక్షి మాట్లాడుతూ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు వ్యవసాయ అనుబంధ శాఖల సమన్వయంతో, రైతు భరోసా కేంద్రాల సహకారంతో సేవలను రైతులకు మరింత విస్తరింప చేయాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రావు మాట్లాడుతూ గత సంవత్సరం కరువు వలన దిగుబడులు చాలా తగ్గాయని, ప్రత్యామ్నాయ పంట పరిశోధనలు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు మాట్లాడుతూ... మిరప, ఉల్లిలో కలుపు నివారణపై రైతులకు అవగాహన కల్పించాలని మొక్కజొన్న కొనుగోలు సమయంలో పాటించవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని కోరారు. నాబార్డ్ అధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ... రైతులకు ఉపయోగపడే విధంగా ప్రణాళికలు రూపొందిస్తే ఆర్థిక సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖల ఉన్నతాధికారులు, అభ్యుదయ రైతులు, రైతు ఉత్పత్తి సంఘాల సభ్యులు ఇన్పుట్ ఏజెన్సీస్ డీలర్లు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న అహోబిలేశుని పార్వేట



రుద్రవరంలో పూజలందుకుంటున్న ఉత్సవమూర్తులు



హరినగరం సమీపంలోని ఇస్కాన్ టెంపుల్

- వీడ్కోలు పలికేందుకు హరినగరం ఇస్కాన్ టెంపుల్ ముస్తాబు
- భారీ ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

రుద్రవరం: తన వివాహ మహోత్సవానికి భక్తజనాన్ని ఆహ్వానించేందుకు బయలుదేరిన అహోబిలేశుడి పార్వేటకు ముగింపు పలికేందుకు హరినగరంలోని ఇస్కాన్ టెంపుల్ ముస్తాబైంది. అహోబిలం నుంచి మకర సంక్రాంతి పర్వదినం జనవరి 16వ తేదీన ఉత్సవమూర్తులు జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాదవరద స్వామిని పల్లకీలో పార్వేటగా బయలుదేరారు. నాటి నుంచి ఆళ్లగడ్డ, రుద్రవరం, ఉయ్యాలవాడ గ్రామాల్లోని 33 గ్రామాల్లో 44 రోజుల పాటు పర్యటించి ఆయా గ్రామాల భక్తుల నుంచి విశేష పూజలందుకున్నారు. మంగళవారం మండల కేంద్రమైన రుద్రవరంలోని ఆయా తెలుపులపై కొలువు కాగా భక్తులు దర్శించుకుంటున్నారు. చివరి రోజు బుధవారం అటవీ కార్యాలయ ప్రాంగణంలోని తెలుపు మీదకు చేరనుంది. అక్కడ పూజా కార్యక్రమాలు పూర్తి కాగానే స్వామి వారి పల్లకీ హరినగరం సమీపంలోని ఇస్కాన్ టెంపుల్ వద్దకు చేరుతుంది. అక్కడ వీడ్కోలు పలికేందుకు ఇస్కాన్ టెంపుల్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జ్ చంద్రకేశవదాస్ భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. టెంపుల్ వద్ద ఆళ్లగడ్డ – అహోబిలం ప్రధాన రహదారికి ఇరువైపుల కిలో మీటర్ల మేర విద్యుద్దీపాలంకరణ గావించారు. అలాగే రహదారికి పక్కనే ఉత్సవ మూర్తుల పల్లకీని కొలువు దీర్చేందుకు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు వేదిక సిద్ధం చేశారు. సాయంత్రం 5 గంటలకు రష్యా నుంచి వచ్చిన 50 మంది ఇస్కాన్ భక్తులు కీర్తనలు, భజనలు, అనంతరం తులసి, గౌర హారతి, నరసింహ కీర్తన, నెల్లూరు నాట్య మండలి వారి ఆధ్వర్యంలో భరత నాట్యం, కూచిపూడి వంటి ప్రదర్శన, జానపద నృత్య ప్రదర్శన వంటి కార్యక్రమాలు చేపట్టారు. బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు కార్యక్రమాలు నిర్వహించి మంగళహారతితో ముగించి ఉత్సవ మూర్తుల పల్లకీని అహోబిలానికి చేరుకునేందుకు వీడ్కోలు పలుకుతామని తెలిపారు.

నాలుగు టిప్పర్లు సీజ్

కర్నూలు (న్యూటౌన్): కల్లూరు మండలం తడకనపల్లె నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేసి, ఒక్కో టిప్పర్‌కు రూ.20 వేల చొప్పున రూ.40వేలు అపరాధ రుసుం విధించి వసూలు చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ మంగళవారం తెలిపారు. కర్నూలు నగర శివారులో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేసి రూ.65 వేల అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి పాల్గొన్నారు.

బాలుడిపై కుక్క దాడి



తీవ్రంగా గాయపడిన బాలుడు

హాలహర్వి: మండలంలోని సిద్ధాపురం గ్రామంలో ఓ బాలుడిపై కుక్క దాడి చేసింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ఉదయం 9 గంటల సమయంలో ఇంటి ఆవరణలో బాలుడు హరీష్ ఆడుకుంటుండగా ఒక్కసారిగా కుక్క దాడి చేసింది. తలకు తీవ్ర గాయం కావడంతో తల్లిదండ్రులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా మరో నలుగురిపై కూడా కుక్క దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు.